వాయిస్ ఆఫ్ Voice of Vande Bharath
వందే భారత్
VOICE OF
VANDE BHARATH
మంగళవారం, ఆగస్టు 25, 2026

# స్వేచ్ఛకు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేసింది

- బీజేపీ అడ్డంకులతోనే సీఎం రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటన నిలిచింది




**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజల స్వేచ్ఛ హరించుకుపోయిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు మాట్లాడే స్వేచ్ఛతో పాటు తమ సమస్యలపై ధర్నాలు, నిరసనలు చేపట్టే అవకాశం కల్పించిందని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలనలో ఇందిరాపార్క్‌లో ప్రజలు తమ డిమాండ్లపై ధర్నాలు నిర్వహించుకునే స్వేచ్ఛ లభించిందని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో ఉచిత బస్సు ప్రయాణం, రుణమాఫీ, సన్నబియ్యం పంపిణీ, రేషన్ కార్డులకు స్మార్ట్ కార్డుల జారీ వంటి కార్యక్రమాలను ప్రస్తావించారు. రుణమాఫీలో సుమారు 90 శాతం పూర్తయిందని పేర్కొన్నారు. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి విద్య, అభివృద్ధి అంశాలపై అమెరికా పర్యటనకు వెళ్లేందుకు సిద్ధమైన సమయంలో కేంద్ర ప్రభుత్వం అడ్డంకులు సృష్టించిందని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. లండన్ వరకు వెళ్లిన ముఖ్యమంత్రిని అక్కడి నుంచే వెనక్కి రప్పించారని పేర్కొన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి పర్యటనను అడ్డుకోవడం అంటే తెలంగాణ ప్రజలను అవమానించడమేనని అన్నారు. అమెరికా పర్యటనకు సీఎం ఎందుకు వెళ్లకుండా అడ్డుకున్నారో కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రజలు, విద్యార్థులు, మేధావులు ఈ అంశంపై ఆలోచించాలని కోరారు. ప్రధాని నరేంద్ర మోదీ గతంలో పాకిస్తాన్‌లోని లాహోర్‌కు వెళ్లిన విషయాన్ని ప్రస్తావిస్తూ కాంగ్రెస్ నాయకులు బీజేపీపై ప్రశ్నలు సంధించారు. ప్రధాని మోదీ పాకిస్తాన్ పర్యటనపై బీజేపీ నేతలు వివరణ ఇచ్చిన తర్వాతే సీఎం రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటనపై విమర్శలు చేయాలని అన్నారు. అధికారికంగా అమెరికా పర్యటనకు వెళ్లాలనుకున్న తెలంగాణ సీఎంను అడ్డుకోవడం వెనుక కారణాలను కేంద్రం వెల్లడించాలని డిమాండ్ చేశారు. విద్య, అభివృద్ధి అంశాలపై పర్యటించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి అమెరికా వెళ్లాలనుకున్నారని, ఆయన పర్యటనను అడ్డుకోవడం సరికాదని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాహుల్ గాంధీ నాయకత్వంలో పనిచేయడానికి పూర్తి నిబద్ధతతో ఉన్నారని, బీజేపీ నేతలు ఎలాంటి రాజకీయ ఊహాగానాలు చేయాల్సిన అవసరం లేదని కాంగ్రెస్ నాయకులు వ్యాఖ్యానించారు. సీఎం విషయంలో ఇతర పార్టీల నుంచి వస్తున్న రాజకీయ వ్యాఖ్యలు 'ఐన్‌సైడ్ లవ్' వంటివని ఎద్దేవా చేశారు. తెలంగాణ అభివృద్ధి, విద్యా రంగం బలోపేతం కోసం సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని, ఆయన విదేశీ పర్యటనలను రాజకీయ కోణంలో చూడకుండా రాష్ట్ర ప్రయోజనాల దృష్టితో చూడాలని కోరారు.

# యశోదలో అత్యాధునిక 'ఎక్మో' సేవలు




**హనుమకొండ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** తీవ్రమైన గుండె, ఊపిరితిత్తుల వైఫల్యంతో ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులకు సోమాజిగూడ యశోద హాస్పిటల్స్‌లో అత్యాధునిక ఎక్స్‌ట్రాకార్పోరియల్ మెంబ్రేన్ ఆక్సిజనేషన్ సేవలు అందుబాటులో ఉన్నాయని కన్సల్టెంట్ క్రిటికల్ కేర్ మెడిసిన్ డాక్టర్ హరి ప్రసాద్ తెలిపారు. మంగళవారం హనుమకొండలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సాధారణ చికిత్సలు సరిపోని పరిస్థితుల్లో గుండె, ఊపిరితిత్తుల పనితీరుకు తాత్కాలికంగా మద్దతు అందించే లైఫ్ సపోర్ట్ విధానమే 'ఎక్మో' అని వివరించారు. ఇది రక్తంలోకి ఆక్సిజన్‌ను అందించడంతో పాటు కార్బన్ డయాక్సైడ్‌ను తొలగించి, రక్తాన్ని తిరిగి శరీరంలోకి పంపుతుందని తెలిపారు. తీవ్రమైన శ్వాసకోశ వైఫల్యం, కార్డియోజెనిక్ షాక్, కార్డియాక్ అరెస్ట్ వంటి ప్రాణాపాయ పరిస్థితుల్లో రోగి పరిస్థితిని సమగ్రంగా పరిశీలించిన అనంతరం 'ఎక్మో'ను పరిగణనలోకి తీసుకుంటామని చెప్పారు. వీవీ 'ఎక్మో' ప్రధానంగా ఊపిరితిత్తుల వైఫల్యానికి, వీఏ 'ఎక్మో' గుండెతో పాటు ఊపిరితిత్తుల పనితీరుకు మద్దతు ఇస్తుందని వివరించారు. రోగి కోలుకునే వరకు, అవయవ మార్పిడి లేదా తదుపరి చికిత్స అందించే వరకు 'ఎక్మో' ఒక వారధిలా పనిచేస్తుందని డాక్టర్ హరి ప్రసాద్ పేర్కొన్నారు. 'ఎక్మో' విజయవంతానికి సాంకేతికతతో పాటు సరైన సమయంలో నిర్ణయం, నిరంతర పర్యవేక్షణ, ఇంటెన్సివిస్టులు, అనస్థీషియాలజిస్టులు, సర్జన్లు, నర్సులు, పర్ఫ్యూజనిస్టులు తదితర నిపుణుల సమన్వయం కీలకమన్నారు. సోమాజిగూడ యశోద హాస్పిటల్స్‌లో 24×7 క్రిటికల్ కేర్ సేవలతో మల్టీడిసిప్లినరీ బృందం అందుబాటులో ఉంటుందని తెలిపారు. సమావేశంలో మార్కెటింగ్ మేనేజర్ పి.సంజీవ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి

- సీఎం రేవంత్‌రెడ్డిపై ఈటల రాజేందర్ తీవ్ర విమర్శలు




**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు చేపట్టిన నిరాహార దీక్షకు ఆయన సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల కాకపోవడంతో పేద విద్యార్థులు చదువులు కొనసాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఫీజులు చెల్లించలేక విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రామచంద్రరావు మాట్లాడుతూ పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం అమలు చేస్తున్నారని తెలిపారు. కూలీలు, రైతులు, ఆటోడ్రైవర్లు, చిరువ్యాపారుల పిల్లలు ఉన్నత విద్య అభ్యసించేందుకు ఈ పథకం ఎంతో ఉపయోగపడుతోందన్నారు. ఫీజులు చెల్లించకపోవడంతో విద్యార్థులతో పాటు ప్రైవేట్ కళాశాలలు కూడా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఎలాంటి జాప్యం చేయకుండా పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయాలని రామచంద్రరావు డిమాండ్ చేశారు. బకాయిలు విడుదల చేసే వరకు బీజేపీ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో విద్యార్థులు, రైతులు, నిరుద్యోగులు, పేద కుటుంబాల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని, మరో ఉద్యమానికి అవకాశం రాకముందే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు.

# పాలిటెక్నిక్ విద్యపై అధ్యయనానికి తెలంగాణ రక్షణ సేన కమిటీ

**జీవో 97తో తలెత్తే పరిణామాలపై సమగ్ర అధ్యయనం..**

**వారం రోజుల్లో నివేదిక ఇవ్వాలని కవిత ఆదేశం**

**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** తెలంగాణలో పాలిటెక్నిక్ విద్య కొనసాగింపు, దాని ఆవశ్యకతపై సమగ్ర అధ్యయనం చేసేందుకు తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత విద్యావేత్తలు, పార్టీ నాయకులతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 97 ద్వారా పాలిటెక్నిక్ విద్యను స్కిల్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకురావడంపై విద్యార్థుల్లో ఆందోళన నెలకొన్న నేపథ్యంలో ఈ కమిటీని ఏర్పాటు చేసినట్లు కవిత తెలిపారు. జీవో 97ను రద్దు చేయాలని, పాలిటెక్నిక్ విద్యను శక్తి (కార్మిక శాఖ) పరిధిలోకి తీసుకురావద్దని విద్యార్థులు నిరసనలు వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న విధానంలోనే పాలిటెక్నిక్ విద్యను కొనసాగించడం, జీవో 97 అమలుతో తలెత్తే పరిణామాలు, స్కిల్ యూనివర్సిటీ పరిధిలోకి చేర్చడం వల్ల కలిగే ప్రయోజనాలు, దుష్పరిణామాలపై కమిటీ సమగ్రంగా అధ్యయనం చేయనుంది. విద్యార్థుల భవిష్యత్‌పై ప్రభావం చూపే అంశాలను పరిశీలించి వారం రోజుల్లోగా నివేదిక సమర్పించాలని కవిత కమిటీ సభ్యులను ఆదేశించారు. కమిటీ సభ్యులుగా దూగుంట్ల నరేశ్ ప్రజాపతి, మోరం వీరభద్రరావు, సురభి, కొంగర ధరణి రాణి, కోట్ల మహేందర్‌రెడ్డి, ఊదరి చంద్రమోహన్ గౌడ్, నడిపల్లి వెంకటేశ్వర్‌రావు ఉన్నారు.

# మొక్కలే మానవ మనుగడకు మూలాధారం

**ఎమ్మెల్యే నవీన్ యాదవ్**



**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** పర్యావరణ పరిరక్షణతో పాటు భావితరాలకు పచ్చని, ఆరోగ్యకరమైన భవిష్యత్తును అందించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వి.నవీన్ యాదవ్ పిలుపునిచ్చారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో వనమహోత్సవంలో భాగంగా ఎర్రగడ్డ ఛాతీ వ్యాధుల ఆసుపత్రి ఆవరణలో ఎమ్మెల్యే మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వచ్ఛమైన గాలి, పర్యావరణ సమతుల్యతకు చెట్లు ఎంతో కీలకమన్నారు. మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణ బాధ్యతను కూడా ప్రతి ఒక్కరూ తీసుకోవాలని సూచించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గాన్ని మరింత పచ్చదనంతో నింపేందుకు ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో పోలీసు అధికారులు, వైద్య సిబ్బంది, జీహెచ్ఎంసీ అధికారులు, పారిశుద్ధ్య కార్మికులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా ఎన్ఆర్ఐ జూనియర్ కళాశాల ఫ్రెషర్స్ వేడుకలు




**వరంగల్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** ఎన్ఆర్ఐ జూనియర్ కళాశాల ఫ్రెషర్స్ వేడుకలు ఎన్టీఆర్ గార్డెన్‌లో ఘనంగా నిర్వహించారు. కాకతీయ యూనివర్సిటీ ఎకనామిక్స్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సాంబశివరావు ముఖ్య అతిథిగా హాజరై వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతోనే జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగడంతో పాటు పేదరిక నిర్మూలన, సాంకేతిక అభివృద్ధి, నైపుణ్యాల పెంపు సాధ్యమవుతుందని అన్నారు. అనంతరం అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ జక్కుల రాజు యాదవ్, చైర్మన్ మందల శోభ, డైరెక్టర్లు బక్కతట్ల గట్టయ్య యాదవ్, సునవత్ శ్రీనివాస్ నాయక్, దేవేందర్, పి. మౌనిక రెడ్డి, భాస్కర్, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. విద్యార్థుల నృత్య ప్రదర్శనలు, సంప్రదాయ వస్త్రధారణ ఆకట్టుకున్నాయి.